సాక్షి
అనకాపల్లి
గురువారం । 25 । జూలై । 2024



రైల్వేజోన్‌కి రూ.9 కోట్లే! 8లో

దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటుకు ఈ ఏడాదీ మోకాలడ్డుతున్నారు. కొత్త డివిజన్ ఏర్పాటుకు కేవలం రూ.9 కోట్లు కేటాయించారు.

8లో



'అయ్యంకి'కి ఘన నివాళి

విశాఖ: గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్యకు గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు.



విద్యార్థులకు ఆటల పోటీలు

అనకాపల్లి: శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో జీవీఎంసీ మెయిన్‌రోడ్డు పెద్దహైస్కూల్ ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం పక్కనే ఉన్న ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎం మిషన్లను బుధవారం కలెక్టర్ విజయ కృష్ణన్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలలో భాగంగా సీసీ కెమెరాల పనితీరు, ఇతర పరిస్థితులను గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరమైన చర్యల గురించి తెలుసుకొని, అప్రమత్తంగా ఉండాలని అక్కడ అధికారులను ఆదేశించారు. అంతకుముందు లాగ్‌బుక్‌లో సంతకం చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి వై.శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ జిల్లా డైరెక్టర్ అనంతలక్ష్మి

తుమ్మపాల: పని ప్రదేశాల్లో స్త్రీలతో పాటు పిల్లలపై జరిగే లైంగికదాడులు, ఇతర నేరాల నిరోధానికి ప్రభుత్వం అమలుచేస్తున్న మూడు చట్టాలపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ జిల్లా డైరెక్టర్ అనంతలక్ష్మి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి వందరోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలో కోడూరు, గొలగాం గ్రామాల్లో పర్యటించిన ఆమె మహిళలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 21న ప్రారంభమైన మిషన్ శక్తి కార్యక్రమం అక్టోబర్ 4 వరకు వంద రోజుల పాటు ప్రతి పల్లెలో జరుగుతుందన్నారు. మహిళా చట్టాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ప్రభావతి, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి సుజాత



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి సుజాత

నర్సీపట్నం : విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా బోధన జరపాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాధికారిణి సుజాత అధ్యాపకులకు సూచించారు. గురువారం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. అధ్యాపకులతో సమావేశమై ఫలితాలు రాబట్టేందుకు విద్యార్థులకు ఇప్పటి నుండే తర్ఫీదు ఇవ్వాలన్నారు. కళాశాలకు వచ్చే ఆడపిల్లలపై అధ్యాపకులు దృష్టిసారించాలన్నారు. పిల్లలు కళాశాలకు వచ్చే సమయం, బయటకు వెళ్లే సమయం తప్పనిసరిగా రికార్డులో నమోదు చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. నాడు-నేడులో నిర్మించిన వాటర్‌ప్లాంట్ మరుగుదొడ్లను పరిశీలించారు. సక్రమంగా నిర్వహించాలని ప్రిన్సిపాల్ శోభకు సూచించారు.

వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ సంఖ్య మార్పు

గోపాలపట్నం (విశాఖ): వాహన్ పోర్టల్‌లో వాహనాల 11 అంకెల రిజిస్ట్రేషన్ నంబర్ స్థానంలో 10 అంకెల రిజిస్ట్రేషన్ నంబర్లు వేర్వేరు సిరీస్‌లో ఒకే నంబర్లతో మార్పినట్లు ఉపరవాణా కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనాన్షియర్లు, బీమా సంస్థలు ఏదైనా లావాదేవీలకు వెళ్లినపుడు 11అంకెల సిరీస్‌లో పాతనంబర్ సిస్టమ్‌లో నమోదు చేసినపుడు 10అంకెల కొత్త రిజిస్ట్రేషన్ నంబర్ ప్రదర్శితమవుతుందని పేర్కొన్నారు. ఉదాహరణకు పాతనంబర్ ఏపీ31టీవీఏ బదులుగా ఏపీ39వీకే గా చూపిస్తుందని తెలిపారు. అలాగే ఏపీ31టీవీబీను ఏపీ39వీఎల్‌గా మార్చినట్లు తెలియజేశారు.

సౌర శక్తిమాన్

సంప్రదాయ పద్ధతిలో బెల్లం తయారీకి స్వస్తి చెబుతూ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) కాలుష్యరహితంగా బెల్లం వండే అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం బయో గ్యాసిఫయర్ పొయ్యిని రూపొందించింది. విద్యుత్ శక్తితో పనిలేకుండా సౌరశక్తితో ఈ యూనిట్ పనిచేస్తుంది.




బెల్లం తయారు చేస్తున్న రైతు

బెల్లం రైతుకు తీయని బహుమతి

- బయో గ్యాసిఫయర్ పొయ్యిని రూపొందించిన ఆర్‌ఏఆర్‌ఎస్
- కాలుష్యరహితంగా బెల్లం వండే అవకాశం
- కరెంటుతో పనిలేకుండా సోలార్ పవర్‌ను వినియోగించే విధానం



నాలుగు రోలర్స్ ద్వారా చెరకు రసం తీస్తున్న రైతు



సౌరశక్తి వినియోగించి బయో గ్యాసిఫయర్ పొయ్యితో బెల్లం తయారు చేసే విధానం

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చెరకు బెల్లం తయారు చేసే యంత్రంలో కూడా మార్పు తెచ్చారు. సాధారణంగా సంప్రదాయ పద్ధతిలో బెల్లం తయారీ ఒక పొయ్యి మీద చేస్తూ ఉంటారు. ఈ పొయ్యిని ప్రత్యేకంగా బెల్లం తయారికి మాత్రమే కట్టించుకుంటారు. ఈ పద్ధతిలో బెల్లం వండినప్పుడు చాలా వరకు కర్బన పదార్థాలు గాలిలోకి వెలువడడమే కాకుండా బెల్లం వండే వ్యక్తుల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందుకుగాను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం చెరకు పంట వ్యర్థాలతో మండే ఒక గ్యాసిఫయిర్ పొయ్యిని అభివృద్ధి చేసింది. ఈ పొయ్యిలో ఫీడింగ్ చూట్ ద్వారా చెరకు పిప్పిని పంపినప్పుడు అది బ్లోయర్‌లో వచ్చే గాలిని ఉపయోగించుకుని, మంట ద్వారా వచ్చిన ఉష్ణాన్ని బెల్లం వండే పెనం కింది భాగానికి పంపిస్తుంది. ఈ పొయ్యిలో గాలిని పంపి బ్లోయర్ని ఉపయోగించి మనం ఎంత ఉష్ణాన్ని పెనానికి పంపాలో కూడా నియంత్రించవచ్చు. ఈ పొయ్యిలో వెలువడే వాయువులను ఒక గొట్టం ద్వారా పైకి పంపిస్తారు. ఈ విధంగా గ్యాసిఫయర్ పొయ్యిని ఉపయోగించి తక్కువ సమయంలో పరిశుభ్రమైన వాతావరణంలో బెల్లం వండవచ్చు.

నిర్మాణ ఖర్చు లేదు.. కరెంటుతో పనిలేదు

గ్యాసిఫయర్ పొయ్యిని స్థాపించడానికి ఎటువంటి నిర్మాణం అవసరం లేదు. సంప్రదాయ పొయ్యిని స్థాపించడానికి అయ్యే ఖర్చు కూడా దీనికి ఉండదు. ప్రాథమిక అంచనా ప్రకారం సంప్రదాయ పద్ధతితో పోల్చితే నాణ్యమైన బెల్లం తయారు చేయడానికి పట్టే సమయాన్ని 10 శాతం వరకు, చెరకు పిప్పిని 20 శాతం వరకు ఆదా చేయవచ్చును. అదే విధంగా ఉష్ణ సామర్థ్యాన్ని 5 శాతం పెంచవచ్చును. చెరకు క్రషర్లు సాధారణంగా విద్యుత్‌శక్తితో నడుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో హఠాత్తుగా విధించే విద్యుత్ కోతల వలన చెరకు రసం పూర్తిగా తియ్యలేక, బెల్లం వండడానికి ఆలస్యమై చెరకు రసం పాడైపోతుంది. అందువల్ల బెల్లం నాణ్యత తగ్గిపోతుంది. ఈ విధంగా వేసవి కాలంలో ఎక్కువ విద్యుత్ కోతలు ఉన్నప్పుడు సౌరశక్తిని ఉపయోగించి ఈ క్రషర్‌ను నడుపుకునేందుకు వీలుగా సౌరశక్తి ప్యానల్స్‌తో నడిచే 6.58 కిలోవాట్ల సామర్థ్యం గల 4 రోలర్ల క్రషర్‌ను ప్రాంతీయ పరిశోధన స్థానం అభివృద్ధి చేసింది. ఈ విధంగా సౌరశక్తి ప్లేట్లతో వచ్చిన విద్యుత్ శక్తితో క్రషర్లను నడపడం వలన గంటకు 3 యూనిట్లను ఆదా చేయడమే కాకుండా విద్యుత్ కోతల వలన వచ్చే ప్రతికూలతలను ఎదుర్కొనవచ్చు. సౌరశక్తితో పనిచేసే చెరకు రసం తీసే యంత్రము, చెరకు పిప్పితో పనిచేసే గ్యాసిఫయర్‌ను రూ.6.5 లక్షలతో అభివృద్ధి పరిచి నాణ్యమైన బెల్లం తయారీ విధానాన్ని రూపొందించారు.

రైతులకు అవగాహన కల్పిస్తాం



సౌరశక్తి, బయోమాస్ గ్యాసిఫియర్ పొయ్యతో బెల్లం తయారు చేసే యంత్రాన్ని మా శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఇప్పటికే రెండు మూడుసార్లు ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో బెల్లం తయారు చేసి చూపించారు. ఆ ఏడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో మరోసారి బెల్లం తయారు చేసిన తరువాత వచ్చే ఏడాది జనవరి నుంచి రైతులకు ఈ యంత్రంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. అప్పుడు రైతులకు అందుబాటులోకి తెస్తాం. విద్యుత్ ద్వారా బెల్లం తయారు చేసినప్పుడు కరెంట్ పోతే బెల్లం పాడై పోయే పరిస్థితి ఏర్పడుతుంది. సౌరశక్తి ద్వారా అటువంటి సమస్య ఉండదు.

–పి.వి.కె.జగన్నాథరావు, ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త

త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీఎంఆర్‌డీఏ సాంకేతిక విభాగంపై సమీక్ష నిర్వహించారు. ప్రాధాన్యత క్రమంలో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగ భవన్‌లో అన్ని అంతస్తులు తిరిగి భవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

లోకమాన్య తిలక్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): సెంట్రల్ రైల్వే, పూణే డివిజన్ డౌండ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనుల నిమిత్తం పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

- ఈ నెల 29 నుంచి ఆగస్టు 1 వరకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయల్దేరే లోకమాన్య తిలక్ టెర్మినస్ – విశాఖపట్నం (18520) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా మళ్లించిన మార్గంలో వయా పూణే – మిరాజ్ – కుర్దువాడి మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 30న భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్ – పూణే (22882) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సోలాపూర్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఆగస్టు 1న పూణేలో బయల్దేరాల్సిన పూణే – భువనేశ్వర్ (22881) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పూణే నుంచి కాకుండా సోలాపూర్ నుంచి బయల్దేరుతుంది. ఈ రైలు ఆయా తేదీల్లో పూణే – సోలాపూర్ మధ్య రాకపోకలు సాగించదు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

- జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసరావు

ఆరిలోవ (విశాఖ):

కొత్తగా చేసిన చట్టాలు గురించి జైలు అధికారులు, కింది స్థాయి సిబ్బందికి వివరించేందుకే జాతీయ స్థాయి సదస్సు నిర్వహించినట్లు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ) ఆధ్వర్యంలో విశాఖ కేంద్ర కారాగారంలో ఈ నెల 22న ప్రారంభమైన జాతీయ స్థాయి సదస్సు బుధవారంతో ముగిసింది. బీపీఆర్‌డీ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కె.మీనా, ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ సదస్సు జరగ్గా.. ఇ.ఎస్.ఎల్.ఎ



ఐజీ ఇండ్ల శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కిశోర్

స.యు. న్యాయ కళాశాల, ఎన్.వి.ఎస్. న్యాయ కళాశాల, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలకు చెందిన పలువురు ప్రొఫెసర్లు మూడు రోజుల పాటు కొత్త నేర చట్టాలపై జైలు అధికారులకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాల్లో ఎలాంటి మార్పులు జరిగాయి.. తదితర అంశాలను వివరించారు. సదస్సులో భాగంగా పలువురు న్యాయ నిపుణులు, జైలు అధికారులు కొత్త చట్టాలపై పలు సలహాలు, సూచనలు చేశారని.. ఈ అంశాలతో నివేదిక రూపొందించి న్యూఢిల్లీలోని బీపీఆర్‌డీకి అందజేస్తామని ఈ సందర్భంగా ఐజీ తెలిపారు. అనంతరం ఐజీకి విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు జ్ఞాపిక అందజేశారు. సదస్సులో ఏపీతో పాటు తమిళనాడు, జార్ఖండ్, ఢిల్లీ, కర్నాటక రాష్ట్రాల జైళ్ల సూపరింటెండెంట్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు పాల్గొన్నారు.

బాలికకు లైంగిక వేధింపులు

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

రాంబిల్లి (యలమంచిలి): ఇటీవల రాంబిల్లి మండలంలో ప్రేమ పేరుతో 9 తరగతి విద్యార్థిని దర్శినిని హతమార్చిన ఉదంతం మర్చిపోకముందే.. ఇదే మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలిక లైంగిక వేధింపులకు గురైంది. ప్రేమ పేరుతో కొంత కాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అదే గ్రామానికి చెందిన ఇల్లపు గణేష్ (22) బుధవారం మరింత బరితెగించి విద్యార్థినితోపాటు ఆమె కుటుంబ సభ్యులపై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు రాంబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు బుధవారం రాత్రి మీడియాకు తెలిపారు. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న నిందితుడు గతంలో బాలికను వేధించడంతో గ్రామంలో పెద్దల సమక్షంలో హెచ్చరించారు. అయినప్పటికీ యువకుడి ప్రవర్తనలో మార్పు రాకపోగా బాలిక ఇంట్లో మొబైల్ ఫోన్‌కు ప్రేమిస్తున్నానంటూ అసభ్యకర మెసేజీలు పంపేవాడు. ఈ విషయం తెలిసిన యువకుడి కుటుంబ సభ్యులు కూడా అతడిని మందలించారు. అయినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. బాలికను మరింతగా వేధించడం మొదలుపెట్టాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే సీఐ సిహెచ్ నర్సింగరావు సిబ్బందితో బుధవారం గ్రామానికి వెళ్లి ప్రాథమిక విచారణ జరిపి వేధింపులు నిజమేనని నిర్ధారించుకున్నారు. యువకుడి కోసం గాలిస్తున్నారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొడుకు కన్నా ఆస్తి మిన్న!

అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకం.. ఆత్మ తృప్తికై మనుషులు ఆడుకునే నాటకం...అంటూ ఓ సినీ కవి మానవీయత లేని కుటుంబ సంబంధాల్లోని డొల్లతనాన్ని ఏనాడో ఎండగట్టాడు. కన్నప్రేమ కన్నా పెంచిన ప్రేమ గొప్పది అంటారు. కానీ డబ్బు ముందు అన్ని ప్రేమలూ దిగదుడుపే అనడానికి ఇక్కడో తండ్రి నిదర్శనగా నిలిచాడు. ఆస్తి ఇవ్వాల్సి వస్తుందని 35 ఏళ్లుగా పెంచుకున్న కొడుకును ఇంట్లో నుంచి బయటకు గెంటేశాడు..

- పెంపుడు కొడుకును ఇంటి నుంచి తరిమేసిన తండ్రి
- ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని గెంటివేత
- ఇంటి ముందు బిడ్డతో ధర్నాకు దిగిన కొడుకు, కోడలు
- మల్లాంలో ఘటన.. పోలీసులకు ఫిర్యాదు



న్యాయం చేయాలని కోరుతున్న బాధితుడు రమణ, అతని భార్య

బుచ్చెయ్యపేట : కొడుకులు లేరని అన్న కొడుకును 35 ఏళ్ల కిందట దత్తత తీసుకున్నాడు. అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసి పెళ్లి చేశాడు. తీరా ఆస్తి ఇవ్వాల్సి వస్తుందని పెంచిన ప్రేమను పక్కన పెట్టి పెంపుడు కొడుకును, కోడలు, మనవరాళ్ల సహా ఇంట్లోంచి బయటకు గెంటేసిన ఘటన బుచ్చెయ్యపేట మండలం మల్లాంలో జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన బొట్టా పోతురాజు, దేముడమ్మకు ఆరుగురు ఆడపిల్లలు. పోతురాజు అన్న రామునాయుడుకు ముగ్గురు మగ సంతానం. మగ సంతానం లేని పోతురాజు అన్న కుమారుల్లో ఆఖరివాడైన రమణను 35 ఏళ్ల కిందట దత్తత తీసుకున్నాడు. రమణ నాలుగో ఏడాది నుంచి పోతురాజు, దేముడమ్మ వద్దే పెరిగాడు. వీరి రేషన్ కార్డులోను, ఆధార్ కార్డులోను రమణ పేరు కూడా నమోదు చేశారు. 15 ఏళ్ల కిందట పోతురాజు, దేముడమ్మల పెద్ద కూతురు వరహాలమ్మ కుమార్తెను రమణకిచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. ఇప్పటి వరకు ఒకే ఇంట్లో నివాసం ఉంటూ జీవించారు. ఇటీవల పోతురాజు అల్లుడొకరు రమణను ఇంట్లో నుంచి బయటకు పంపేయాలని, లేకపోతే ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని అత్తమామలకు నూరిపోయడంతో రమణ, దేవిలను రెండేళ్లుగా వేరే గదిలో ఉంచారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తక్షణం ఇంట్లోంచి వెళ్లిపోవాలంటూ బుధవారం తన పెంపుడు కొడుకు రమణను, అతని భార్య దేవిలను పోతురాజు ఇంట్లో నుంచి బయటకు గెంటి వేశాడు. వారి వంట సామాన్లు, బట్టలను బయటకు విసిరేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో రమణ, దేవి ఉదయం నుంచి రాత్రి వరకు ఆరు బయటే అర్ధాకలితో ఉండిపోయారు. రమణ ఇద్దరు కుమార్తెలు కశింకోట హాస్టల్‌లో చదువుతుండగా చిన్న కుమార్తెతో కలిసి భార్యభర్తలిద్దరూ వర్షం కురుస్తున్నా ఇంటి బయటే ఉండిపోయారు. తనను అన్యాయంగా ఇంటి నుంచి గెంటివేయడంపై బాధితుడు రమణ బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. పోతురాజుకు ఎకరా 20 సెంట్లు జిరాయితీ భూమి, 5 ఎకరాలు డి పట్టా భూమి, ఇల్లు ఉంది. ఈ ఆస్తిలో వాటా ఇవ్వబడుతుందని చిన్నప్పటి నుంచి పెంచిన రమణను అతని భార్య, పిల్లలను ఇలా అర్ధంతరంగా ఇంటి నుంచి వెళ్లగొట్టడంపై గ్రామస్తులు కూడా మండిపడుతున్నారు. అమాయకుడైన రమణకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

పంట కాలువలకు మహర్దశ



ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాలువ కుంట పనులు



ఉద్యాన పంటల్లో మొక్కలకు కుంటలు చేసిన దృశ్యం

- ఉపాధి పనుల్లో భాగంగా పంట కాలువల్లో పూడికతీత
- ఇప్పటివరకు 659 వ్యవసాయ కాలువల్లో పనులు పూర్తి
- జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలకు పంట కుంటలు
- 2023–24లో నేటి వరకు కోటి పని దినాలు ఉపాధి కల్పన

జిల్లాలో వివరాలు ఇలా..

24 మండలాల్లో 659 పంట కాలువల్లో పూడికతీత పనులు పూర్తి
ఈ పనులకు రూ. 27.17 కోట్లు మంజూరు
2023–24లో నేటి వరకు సుమారుగా కోటి పనిదినాలతో ఉపాధికల్పన
జిల్లాలో 2,39,421 జాబ్‌కార్డులు, 1,47,210 మంది వేతనదారులు

సాక్షి, అనకాపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో పెద్ద ఎత్తున పనులు నిర్వహించారు. ఏడాదిలో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు కల్పించి రికార్డు సృష్టించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ అప్పటి ప్రభుత్వం కోటి పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఆ లక్ష్యాన్ని మించి ఇప్పటివరకు 1 కోటి 9 లక్షల 68వేల పనిదినాలు కల్పించింది. అంతే కాకుండా ఖరీఫ్‌కు ముందుగానే పిచ్చి మొక్కలతో, పుట్టలతో నిండి ఉన్న పంట కాలువలకు, పంట గట్లుకు మోక్షం కలిగింది. ఉపాధి హామీ పథకం పనులతో పంట కాలువలకు మహర్దశ పట్టింది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతు పంట కాలువ పనులను, పంట గట్టులను సొంత డబ్బులను వెచ్చించి పనులు చేపడతారు. గత ప్రభుత్వం వ్యవసాయం నిమిత్తమైన కాలువ పనులు, పంట గట్లు, రోడ్డుకిరువైపులా వాలి ఉన్న పిచ్చి తుప్పలను తొలగించడం వంటి పనులకు కూడా ఉపాధి హామీ పనుల ద్వారా చేయించేందుకు శ్రీకారం చుట్టింది. వీటి కోసం అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులను కూడా మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఏడాది కాలంగా పంటలకు నీరు ప్రవహించే కాలువల్లో ఇసుక, మట్టి, గడ్డి మొక్కలు, చెత్త పేరుకుపోయి అడ్డంగా ఉన్నటువంటి పూడికలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుకు మేలు కలిగేలా పూడికతీత చేపట్టింది. దీంతో రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చడమే కాకుండా రైతులకు ఉపాధిలో వేతనం కల్పించే వినూత్న ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక వైపు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఉపాధి పనులు కల్పిస్తూ..మరో వైపు రైతులకు వ్యవసాయ కాలువల పూడికతీత, పంట గట్లు, ఉద్యానవన తోటలకు చెట్ల చుట్టూ కుంటల పనులు చేశారు. వీటితో పాటు అమృత్ సరోవర్ పథకంలో చెరువుల తవ్వకం, కాలువల వంటి పనులు చేపట్టడంతో ఈ వర్షపు నీరుతో నిండుగా చెరువులున్నాయి. ఇవి భవిష్యత్తులో వరి పంటకు లాభసాటిగా ఉంటాయి.

వ్యవ'సాయం'గా ఉపాధి..



2023–24 సంవత్సరంలో ఉపాధి హామీ పనులు నిర్దేశించిన దానికన్నా అధికంగానే పనిదినాలు కల్పించాం. గతేడాది జూన్ నెల ఒకటో తేది నుంచి నేటి వరకూ సుమారుగా కోటి పనిదినాలు కల్పించాం. వీటిలో పంట కుంటలు, పంట కాలువల పూడికతీత పనులకు గానూ 4 లక్షలకు పైగా పనిదినాలు పూర్తి చేయడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వ్యవసాయ రైతుల విన్నపం మేరకు పంటకాలువ, ఉద్యానవన కుంటలు ఉపాధి పనులు జరిగాయి. రైతులు ఉద్యానపంటలకు కుంటలు తీయడం, కాలువలు వంటి వాటికి పది రోజులు ముందుగా దరఖాస్తు చేసుకుంటే అవి పూర్తి చేస్తాం. గతేడాది ఎస్టీల కుటుంబాలకు అత్యధిక శాతం ఉపాధి కల్పించి రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ కూడా జాబ్‌కార్డు అందిస్తున్నాం. కొత్తగా నమోదు చేసుకున్న వారికి కూడా జాబ్‌కార్డులు అందిస్తున్నాం.

– సందీప్, డ్వామా పీడీ, అనకాపల్లి

క్లుప్తంగా

'అల్లూరి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలి'

నర్సీపట్నం: కవర్ట్, హైటర్ల సమాధుల స్థలాన్ని అల్లూరి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు బుధవారం మీడియాకు తెలిపారు. దామనపల్లి ఘాట్‌లో అల్లూరి సేనలకు, బ్రిటీష్ సేనలకు మధ్య జరిగిన భీకర పోరులో బ్రిటీష్ సైనికాధికారులైన కవర్ట్, హైటర్ మరణించారన్నారు. అల్లూరి చరిత్రకు నర్సీపట్నంలో బ్రిటీష్ సైనికాధిరుల సమాధులే సాక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని పరిక్షించాలని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు వెల్లడించారు.

నక్కపల్లి వీవర్స్ కాలనీలో చోరీ

- రూ.5 లక్షల విలువైన బంగారం అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో విచారణ జరుపుతున్న సీఐ విజయ్‌కుమార్

నక్కపల్లి: స్థానిక వీవర్స్ కాలనీలో ఒక ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకుపోయారు. బాధితులు పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన కోమాకుల సత్యనారాయణ మూడు రోజుల క్రితం కుమార్తెను చూసేందుకు జోగుంపేట వెళ్లాడు. అతని కుమారుడు కూడా మంగళవారం అనకాపల్లి ఆస్పత్రికి తన భార్యను తీసుకెళ్లాడు.అక్కడ పనిముగించుకుని మాడుగులలో తన అత్తారింటికి వెళ్లాడు. సత్యనారాయణ బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తలుపుల తాళాలు పగుల కొట్టి ఉన్నాయి. బీరువాల్లో వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉండడంతో పాటు బీరువాలో ఉండవలసిన సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలు కనిపించ లేదు. చోరీ జరిగిందని గుర్తించిన సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ చోరీ జరిగిన ఇంటిని, బీరువాలు, గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రైల్వేజోన్‌కి రూ.9 కోట్లే!

అసలు మరిచి.. కొసరే..





ఆదాయంలో ఆకాశమంత ఎత్తులో ఉండే వాల్తేరు డివిజన్‌కు ఏటా కేటాయింపులు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. బడ్జెట్ బంతి భోజనంలో మరోసారి వాల్తేరు డివిజన్‌కు అసలు మరిచి.. 'కొసరు' మాత్రమే వడ్డించారు. ముఖ్యంగా కొన్ని ప్రాజెక్టులకు పండగ చదివింపుల మాదిరిగా.. వెయ్యి రూపాయల చొప్పున కేటాయించడం ఆశ్చర్యపరుస్తోంది. లైన్ డబ్లింగ్ పనుల నుంచి మానవ రహిత లెవెల్ క్రాసింగుల వరకు.. రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాల నుంచి రైల్వేయార్డు రీమోడలింగ్ వరకు దేనికైనా వెయ్యే.! దీన్ని బట్టి చూస్తే రాష్ట్రంపై కేంద్రానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజల కల అయిన విశాఖ రైల్వే జోన్‌కు మరోసారి రిక్తహస్తాలు చూపించారు. రాయగడ జోన్ అభివృద్ధితో పాటు జోన్‌కు సంబంధించిన అంబ్రెల్లా వర్క్స్ కోసం కేవలం రూ.9 కోట్లు మాత్రమే కేటాయించి ఈ'సారీ' జోన్ రాదని చెప్పకనే చెప్పేశారు.

– సాక్షి, విశాఖపట్నం

- దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటుకు ఈ ఏడాదీ మోకాలడ్డు
- 2020–21 అంబ్రెల్లా వర్క్స్ కోసమేనంటూ బడ్జెట్‌లో స్పష్టం
- సింహాచలం–గోపాలపట్నం డబ్లింగ్ లైన్‌కి రూ.1000 మాత్రమే విదిలింపు
- మిగిలిన ప్రాజెక్టులపై దృష్టి సారించిన రైల్వే బోర్డు

'జోన్' రైలు.. మరింత ఆలస్యం

ఓ ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నిర్మించాలంటే రూ.అర కోటి వరకు ఖర్చవుతుంది. అలాంటిది ఒక ప్రతిష్టాత్మకమైన జోన్ ఏర్పాటు చేయాలంటే.. ఎంత మొత్తం నిధులు కేటాయించాలి.? ఒక కొత్త డివిజన్ ఏర్పాటుకు ఎంతివ్వాలి? విత్త మంత్రికి ఇవన్నీ తెలిసినా.. పప్పుబెల్లాలు విదిల్చినట్లు అక్షరాలా రూ.9 కోట్లు మాత్రమే కేటాయించారు. జోన్ ప్రకటించి ఐదేళ్లు దాటింది. బడ్జెట్‌లో జోన్ ఊసే ఎత్తని కేంద్రం మంగళవారం రాత్రి విడుదల చేసిన పింక్ బుక్‌లో విశాఖ కేంద్రంగా ఏర్పాటవుతున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్, రాయగడ డివిజన్ అంబ్రెల్లా వర్క్స్ కోసం కేవలం రూ.9 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. అదిగో ఇదిగో అంటూ ఇన్నాళ్లు జోన్ కార్యకలాపాల ప్రారంభంపై ఊరించిన కేంద్రం.. బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే వారికెంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. ఒక ప్రధాన రైల్వే జోన్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఫర్నిచర్ కొనుగోలుకు కూడా సరిపోనంతగా కాసులు విదిల్చి.. మమా అనిపించేసింది.

షాక్‌కు గురిచేసిన కేటాయింపులు

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటికే దీనికి సంబంధించిన డీపీఆర్‌ను 2019 నవంబర్‌లో జోన్ ఓఎస్‌డీ రైల్వే మంత్రిత్వ శాఖకు అందించారు. 2020 ఏప్రిల్ 1 నుంచి అధికారికంగా జోనల్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అంతా ఊహించారు. కానీ జరగలేదు. ఈ ఏడాదైనా మంచి జరుగుతుందని భావించినప్పటికీ.. ఊహించని విధంగా బడ్జెట్ కేటాయింపులు అందరినీ షాక్‌కి గురి చేశాయి. జోన్ ఏర్పాటుతో పాటు రాయగడ డివిజన్ ఏర్పాటుకు రూ.170 కోట్లు నిధులు అవసరమని అంచనాలు వేసిన కేంద్రం.. రూ.9 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు జోనల్ కార్యకలాపాలకు సంబంధించిన ఏ పని పూర్తిచేసేందుకూ ఉపయోగపడవని వాల్తేరు డివిజన్ అధికారులు సైతం వాపోతున్నారు. ఈ లెక్కన ఈ ఏడాదీ జోన్ కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యే సూచనలు లేవని స్పష్టమవుతోంది.

కీలకమైన కొన్ని ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులివీ..

- ఉత్తర సింహాచలం–గోపాలపట్నం 2.07 కిమీ మేర బైపాస్ లైన్ డబ్లింగ్ పనులకు రూ.1000
- ఓర్ ఎక్స్ఛేంజ్ కాంప్లెక్స్(ఓఈసీ)– ఉత్తర సింహాచలం డబ్లింగ్ 5.22 కిమీ పనుల ప్రాజెక్టు విలువ రూ.257.88 కోట్లు కాగా గత బడ్జెట్‌లో రూ.3 కోట్లు విడుదల చేశారు. ఈసారి రూ.38 కోట్లు కేటాయించారు.
- పెందుర్తి ఉత్తర సింహాచలం మధ్య సింహాచలం ప్రాంతంలో సర్ఫేస్ క్రాసింగ్ ఇబ్బందులు తొలగించేందుకు రూ.183.65 కోట్లతో 7.135 కిమీ మేర ఫ్లైఓవర్ ప్రాజెక్టు కోసం రూ.10.63 కోట్లు కేటాయించారు.
- దువ్వాడ– ఉత్తర సింహాచలం మధ్య 20.543 కిమీ మేర థర్డ్, ఫోర్త్ లైన్స్ ప్రాజెక్టు రూ.302.25 కోట్లు వ్యయం కాగా.. రూ.117.18 కోట్లు కేటాయించారు.
- గంగవరం పోర్టు నుంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు వడ్లపూడి గేట్‌ను అనుసంధానిస్తూ 12.04 కిమీ మేర థర్డ్, ఫోర్త్ లైన్స్‌కు రూ.154.28 కోట్లు కాగా.. రూ.79.58 కోట్లు కేటాయించారు.
- విశాఖపట్నం–గోపాలపట్నం మధ్య 15.31 కిమీ మేర రూ.159.47 కోట్లతో థర్డ్, ఫోర్త్ లైన్స్ ప్రాజెక్టు కోసం రూ.55.22 కోట్లు కేటాయించారు.
- గోపాలపట్నం నుంచి దువ్వాడ వరకూ ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థకు రూ.1000 కేటాయించారు.
- వాల్తేరు డివిజన్ పరిధిలోని 9 రైల్వే స్టేషన్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ వెలుగుల ప్రాజెక్టు వ్యయం రూ.31.37 కోట్లు కాగా రూ.1000 కేటాయించారు.
- గోపాలపట్నం నుంచి సింహాచలం బైపాస్ లైన్, విజయనగరం వరకూ ఆటోసిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.32.78 కోట్లు కేటాయించారు.
- డివిజన్ పరిధిలో 72.276 కిమీ మేర ఉన్న పలాస–విశాఖపట్నం–దువ్వాడ మధ్య ట్రాక్ రెన్యువల్ పనులకు రూ.50 లక్షలు కేటాయించారు.
- ఉత్తర సింహాచలం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు సెంట్రల్ ట్రాక్ రెన్యువల్ పనుల కోసం రూ.కోటి కేటాయించారు.

అరకొర కేటాయింపులతో ఏం చేస్తారో.?

వాల్తేరు డివిజన్ పరిధిలో వివిధ పనులకు జరిగిన కేటాయింపులను ఓసారి పరిశీలిస్తే.. రైల్వే బోర్డు బడ్జెట్ కేటాయింపులు చేసిందా? ఏదో మమా.. అనిపించిందా అన్న అనుమానాలు కలగక మానవు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌పై భారం పడకుండా.. రైలు ప్రయాణాలు సజావుగా సాగాలంటే అత్యంత కీలకమని భావిస్తున్న ఉత్తర సింహాచలం–గోపాలపట్నం డబ్లింగ్ బైపాస్ లైన్(2.07 కిమీ) పనులకు కేటాయించింది కేవలం రూ.వెయ్యి మాత్రమే. గోపాలపట్నం నుంచి దువ్వాడ వరకూ ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థకూ ఇచ్చింది రూ.వెయ్యే. వాల్తేరు డివిజన్ పరిధిలోని 9 రైల్వే స్టేషన్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ వెలుగుల ప్రాజెక్టుకీ ఇచ్చింది వెయ్యి రూపాయలే. ఇలా పలు ప్రాజెక్టులకు అరకొరగా అందించిన కేంద్రం.. మరికొన్ని ప్రాజెక్టుల విషయంలో డివిజన్‌పై దాతృత్వం చూపించింది.



ఆకలి చావులకు ఆజ్యం పోసేలా కేంద్ర బడ్జెట్

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బీటీ దొర



వాలాబులో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా గిరిజనులతో కలిసి నిరసన తెలుపుతున్న బీటీ దొర

దేవరాపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆకలి చావులకు ఆజ్యం పోసేలా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బీటీ దొర ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో అరకొర కేటాయింపులను వ్యతిరేకిస్తూ మండలంలోని వాలాబులో గిరిజనులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. పేదల గృహ నిర్మాణానికి, అంగన్‌వాడీలకు గత బడ్జెట్ కంటే తక్కువగా కేటాయించారని ఆక్షేపించారు. సామాజిక పింఛన్లు, విద్య, వైద్య రంగాలకు సైతం అరకొర కేటాయింపులే చేశారన్నారు. గ్రీన్ ఫీల్డ్ కారిడార్ పేరిట అటవీ భూములను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు బడ్జెట్‌లో నిర్ణయాలు ఉన్నాయని ఆరోపించారు. గిరిజనుల జీవితాలను ఛిన్నాభిన్నం చేసే ఈ నిర్ణయాన్ని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీహెచ్ లక్ష్మణరావు, చిన్నారావు, ఎరకన్నదొర, దేముడు తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

యలమంచిలి రూరల్: మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి యలమంచిలి సెకండ్ క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ బుధవారం మీడియాకు తెలిపారు. నాతవరానికి చెందిన అల్లు వెంకటరమణ, దార్లపూడికి చెందిన ముత్యర్తి రవిలు ఈ నెల 22న మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడ్డారు. రేగుపాలెం హైవే కూడలి వద్ద చేపట్టిన తనిఖీల్లో దొరికిన వీరిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఇద్దరికీ మూడేసి రోజుల జైలు శిక్ష విధించడంతో, వారిని యలమంచిలి సబ్‌జైల్‌కు తరలించారు.

క్రేన్ ఢీకొని విశ్రాంత ఉద్యోగి దుర్మరణం

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలిలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి షేక్ ఆలీ దుర్మరణం పాలయ్యారు. ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు తెలిపిన వివరాలివీ.. వేములవలస మార్కెట్ వద్ద ఉన్న తన ఇంటి నుంచి పాత ఊరు వద్ద సీలింగ్ ఫ్యాన్ కొనేందుకు ఫ్లై ఓవర్ కింద నుంచి ఆలీ నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనుకనే వస్తున్న క్రేన్ జోరుగా, అజాగ్రత్తగా వచ్చి అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో క్రేన్ కుడి చక్రం అతనిపై నుంచి వెళ్లగా నడుం, ఇతర భాగాలకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి చికిత్సకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య నజీబ్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ గాంధీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంట తెగుళ్లపై అప్రమత్తత అవసరం

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: తాజా వర్షాలకు నారుమడిలో నిలిచిన నీటిని వీలైనంత వేగంగా తొలగించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు సూచించారు. పట్టణంలోని తమ కార్యాలయంలో బుధవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి పంటకు సోకే తెగుళ్ల నివారణలో అప్రమత్తంగా ఉండాలని, సస్య రక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో జింక్ లోపం తలెత్తే అవకాశం ఉన్నందున, దాని నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. నారుమడిలో పాడ తెగులు రాకుండా హెక్సాకొనజోల్ 2 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. వరిలో వర్షాల కారణంగా కలుపు సమస్య పెరగకుండా పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్‌ను ఎకరానికి 80–100 గ్రాముల చొప్పున 20–25 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 4 నుంచి 7 రోజులలో వేసుకోవాలన్నారు. తేమను ఉపయోగించుకుని 10 రోజుల వయసు ఉన్న వరి నారుమడిలో కార్బోఫ్యూరాన్ గుళికలను సెంటుకు 150 గ్రా.ల చొప్పున చల్లుకోవాలన్నారు.

రాగులు పంటలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కార్బెండిజం 1 గ్రాము, లేదా ట్రైసైక్లోజోన్ 0.5గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని చోడి(రాగి)ని నాటుకునే రైతులకు ప్రత్యేక సూచనలిచ్చారు. స్వల్ప కాలిక రకాలైతే 10–15 సెం.మీ. దూరం, మధ్య కాలిక రకాలను 15–20 సెం.మీ. దూరంలో నాటుకోవాలన్నారు. రాగులు సాగు చేసేవారు ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలన్నారు. ఎకరాకు 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 13 కిలోల పొటాష్‌ను విత్తునాటే సమయంలో వేసుకోవాలని సూచించారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

గొలుగొండ: రెండు కిలోల గంజాయి బ్యాగ్‌తో పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్లు గొలుగొండ ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపారు. వివరాలివి. ఏటిగైరంపేట చెక్‌పోస్టు సమీపంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రావికమతం మండలం, అజ్జాపురానికి చెందిన మైనర్ బాలుడు బ్యాగ్‌తో అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో బ్యాగ్‌ను తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయిని గుర్తించినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, కోర్టుకు అప్పగించామన్నారు.

పెరటి ద్రాక్ష తియ్యన



ద్రాక్ష మొక్క నుంచి సేకరించిన పండ్లు



పక్వానికి వచ్చిన ద్రాక్ష గుత్తు

అందని ద్రాక్షే కాదు.. అందిన ద్రాక్ష కూడా చాలా వరకు పుల్లనే..! ఎక్కడ పండిస్తున్నారో.. ఏ రసాయనాలు వాడుతున్నారో తెలియదు. మార్కెట్లో కొనుగోలు చేసే ద్రాక్ష పండ్లపై భయాలెన్నో. అలాంటి పరిస్థితుల్లో ఇంటి డాబాపైనే గుత్తులుగా ద్రాక్ష వేలాడితే.. పుల్లని ద్రాక్ష కూడా మనసుకు తీపి రుచినే అందిస్తుంది. దేవరాపల్లి మండలం పెదనందిపల్లి ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌కే ముంతాజ్‌బేగం దేవరాపల్లిలోని తన ఇంటి డాబాపై పందిరి ఏర్పాటు చేసి, ఏడాది క్రితం ద్రాక్ష మొక్క నాటారు. ప్రస్తుతం కాపు దశకు వచ్చి గుత్తులతో కనువిందు చేస్తున్నాయి. రెండు మూడు రోజులకోసారి సుమారు 10 కిలోల ద్రాక్ష దిగుబడి వస్తోందని ముంతాజ్‌బేగం 'సాక్షి'కి తెలిపారు. గతంలో స్ట్రాబెర్రీ కూడా ఇదే మాదిరిగా సాగు చేశారు. ఈ ద్రాక్ష గుత్తులను చూసేందుకు చుట్టు ప్రక్కల వారు ఆసక్తిగా వస్తున్నారు.

- దేవరాపల్లి

సరదా.. సరదాగా.. సంప్రదాయ ఆటలు



కప్పగంతులు పోటీ





రింగాట, గచ్చకాయలు ఆడుతున్న విద్యార్థినులు

- శిక్షా సప్తాహ్ కార్యక్రమాలతో సందడిగా పాఠశాలలు

చోడవరం రూరల్: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన సంప్రదాయ ఆటలపోటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 40 రకాలకు పైబడిన పోటీలు నిర్వహించడంతో పాఠశాలలు సందడిగా మారాయి. పలు పాఠశాలల్లో చిప్పాట, గచ్చకాయలు, కప్ప గంతులు, రింగులు నడుముతో తిప్పడం, రంగుల మేచింగ్, వంగుళ్లు–దూకుళ్లు, కర్రాబిల్ల, వైకుంఠపాళి, గాలిపటాల ఎగరేయడం, వామనగంతులు, రాముడు–సీత, వీరివీరి గుమ్మడిపండు వీరి పేరేమి, నాలుగుస్తంభాలాట, తాడు గుంజాట వంటి ఆటలు ఆడించారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు విజేతలకు చిన్నపాటు బహుమతులను అందచేశారు. మండల సీపీఆర్పీ కె.వి.మహాలక్ష్మినాయుడు పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాల అమలుతీరును పర్యవేక్షించారు. ప్రధాన ఉపాధ్యాయులు సుధ, చైతన్య, భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాన్ని తప్పించి.. అనంతలోకాలకు..

- గుండెపోటుతో డ్రైవర్ మృతి
- నొప్పిని భరించి డివైడర్‌ను ఢీకొట్టిన వైనం
- ఆ సమయంలో లారీలో 300 గ్యాస్ సిలిండర్లు





మల్కాపురం: ఓ లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి పెను ప్రమాదం తప్పించినప్పటికీ.. తను మాత్రం గుండెపోటుతో లారీలోనే ప్రాణాలు విడిచాడు. ఈ విషాద ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో భార్య, ఇద్దరు పిల్లలతో శ్రీనివాస్(50) నివాసం ఉంటున్నాడు. అతను హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే లారీ డ్రైవర్‌గా కొంతకాలం నుంచి పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా 300 గ్యాస్ సిలిండర్లతో బుధవారం లారీని నడుపుతూ మారుతీ సర్కిల్ నుంచి వీడీఆర్ గొడౌన్ వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో అతనికి ఛాతీలో నొప్పి రావడంతో చాకచక్యంగా వ్యవహరించాడు. గ్యాస్ సిలిండర్లతో ఉన్న లారీ బోల్తాపడితే పెను ప్రమాదం సంభవిస్తుందని భావించి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో లారీ ఆగింది. అయితే, డివైడర్‌ను ఢీకొట్టిన కొద్దిసేపటికే, గుండెపోటుతో శ్రీనివాస్ లారీలోనే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి.. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఇంటి పెద్దదిక్కు మరణించడంతో అతని భార్య, బంధువులు బోరున విలపించారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరునిపై టీడీపీ కక్ష సాధింపు



కశింకోట తహసీల్దార్‌ను కలిసి విన్నవిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరునిపై టీడీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం శోచనీయమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు విమర్శించారు. బయ్యవరంలో చెరువు స్థలంలో నిర్మించిన స్వీట్ దుకాణం తొలగించాలంటూ దాని నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీకి చెందిన గొల్లవిల్లి బాబూరావుకు నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ తదితరులతో కలిసి తహసీల్దార్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బయ్యవరంలో చెరువు వద్ద దుకాణం నిర్మించుకుని రెండేళ్లుగా స్వీట్లు అమ్ముకుంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన గొల్లవిల్లి బాబూరావు కుటుంబ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అతని కుటుంబానికి ఆధారమైన దుకాణం తొలగింపునకు స్థానిక టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చి తహసీల్దార్ ద్వారా నోటీసులు ఇవ్వడాన్ని ఆక్షేపించారు. దీంతో మనస్తాపం చెందిన బాబూరావు ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సానుభూతితో పరిశీలించి జీవనోపాధికి ఆధారమైన స్వీట్ దుకాణాన్ని కొనసాగించేలా చూడాలని తహసీల్దార్‌ను కోరారు. వీరి వెంట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, స్థానిక పెద్దలు ఉన్నారు.

క్లుప్తంగా

తుది విడత చందన సమర్పణ నేడు

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం దిబ్బ వీధి వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో గురువారం తుది విడత చందన సమర్పణ కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్వాహకుడు మళ్ల రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వర్ణ సంపెంగ పుష్పార్చన, ప్రత్యేక పూజా కార్యాక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద తీర్థప్రసాదాలు అందిస్తామన్నారు. చందన సమర్పణకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాల్సిందిగా కోరారు.

విద్యుత్ షాక్ మృతుని కుటుంబానికి వితరణ



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న స్నేహితులు

మునగపాక : విద్యుత్ షాక్‌కు గురై ఇటీవల మృతి చెందిన సంతోష్ కుటుంబానికి స్నేహితులు బాసటగా నిలిచారు. మునగపాకకు చెందిన యువ రైతు దాడి సంతోష్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. దీంతో సంబంధిత బాధిత కుటుంబానికి బుధవారం స్నేహితులు రూ.50వేల మేర నగదు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. కాండ్రేగుల గణేష్, ఆడారి గణేష్, సూరిశెట్టి భాను తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

నక్కపల్లి: స్థానిక వీవర్స్ కాలనీలో ఉన్న గణపతి ఆలయంలో బుధవారం సంకట హర చతుర్థి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శేషాచార్యులు, అప్పలాచార్యుల ఆధ్వర్యంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కపల్లి వీవర్స్‌కాలనీ, బండారు పేట తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రంథాలయానికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు

ఎస్.రాయవరం : దార్లపూడి ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని హెచ్ఎం రమణశ్రీ అన్నారు. 1985–86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు గ్రంథాలయానికి అవసరమైన సామగ్రి సమకూర్చడంతో గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాల: రాజా	
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-2
డార్లింగ్	: షిర్డీసాయి
భారతీయుడు 2	: పర్తిసాయి
సీడీ	: వెంకటేశ్వర
డిమోంటే కాలనీ	: శ్రీసత్య
బర్త్‌డే బాయ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 76 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–28 యూనిట్లు, ఓ పాజిటివ్–36 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 357 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 289 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

నిండా మునిగిన రైతులు

ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరింది. వరి నారు మడులు, కూరగాయల పంటలు నీట మునిగాయి. దీంతో పంట నష్టంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లూ ఎంతగా రైతులు మొరపెట్టుకున్నా.. సాగునీటి కాలువల్లో పూడికలు తొలగించలేదు. దాని ప్రభావం తాజా వర్షాలకు పంట పొలాలపై భారీగా పడింది. నిండా మునిగాక ఇప్పుడు కాలువల్లో పూడికలు తొలగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ చొరవచూపి పరిహారంతోపాటు, ఉచితంగా విత్తనాలు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మొలక దశలోనే ముంపునకు గురైన వరి విత్తనాలు

- మండలంలో నీట మునిగిన 134 హెక్టార్ల వరి నారుమడులు
- తుమ్మపాల, శంకరం, ఆవఖండం భూముల్లోనే అధిక నష్టం
- నారు కుళ్లిన రైతులకు విత్తనాలు పంపిణీ చేసేలా ప్రతిపాదనలు
- సాంబమసూరి 11.52 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 57.6 క్వింటాళ్లు అవసరం
- ఉచితంగా విత్తనాలు అందించాలని రైతుల అభ్యర్థన



ఆవఖండంలో నీటిలోనే వరి నారుమడులు



నీట మునిగిన నారుమడుల్ని పరిశీలిస్తున్న అధికారులు

తుమ్మపాల: మండలంలో అత్యధికంగా తుమ్మపాల, శంకరం, ఆవఖండం భూములు నీటి ముంపునకు గురయ్యాయి. వరినారు ముడులు, ఎదలు వారం రోజులుగా నీటిలోనే ఉండటంతో దాదాపు కుళ్లిపోయినట్లు అధికారులు నిర్ధారిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వరి నారును కాపాడుకునే సూచనలు కూడా చేస్తున్నారు. అవేవీ ఫలించే సూచనలు కనిపించట్లేదు. వానలు తగ్గాక మళ్లీ విత్తనాలు వేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఆ మేరకైనా ప్రభుత్వం సాయపడాల మొరపెట్టుకుంటున్నారు.

134 హెక్టార్లలో నారుమడుల ముంపు

మండలంలో 134 హెక్టార్ల వరినారు మడులు నీట మునిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఈ పొలాల్లో నీటిని తొలగించి, మొలకెత్తిన వరి నారు, విత్తును కాపాడుకునేందుకు, అవకాశం లేని చోట మళ్లీ విత్తనాలు వేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దాదాపు 250 ఎకరాల్లో వరి విత్తనాలను వేసేందుకు సరిపడా వరి ఆర్‌జీఎల్, సాంబమసూరి రకాల వరి విత్తనాలను రైతులకు అందించాలని నివేదికలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇల్లు తగలబడుతుంటే బావి తవ్వినట్లు!

లోతట్టు ప్రాంతాలైన తుమ్మపాల, శంకరం, ఆవఖండం భూముల్లో వర్షపు నీటితో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీరు కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. సాగునీటి కాలువల్లో ఏళ్లతరబడి పూడిక తీయకపోవడంతో గుర్రపుడెక్క అల్లుకుని నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. దీంతో బొజ్జన్నకొండ పరిసరాల్లో వందల ఎకరాల్లో వరి నారుమడులు మునిగిపోయాయి. రైతుల ఆందోళనతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండ మీదుగా అనకాపల్లి, ఆవఖండం వరకు ఉన్న పులికాలువ, సాగునీటి కాలువల్లో పూడికతీతకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆయా చోట్ల కొంత మేర నారుమడులు తేరుకున్నాయి.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

నారుమడిలో నీరు నిలిచినట్టైతే, వెంటనే నీటిని బయటకి తీసివేయాలి. అనంతరం సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఈ వర్షాల కారణంగా వరి నారుమడిలో పొడ తెగులు ఆశించే అవకాశం ఉంది. దాని నివారణకు లీటరు నీటిలో కార్బెండిజం 1.0 గ్రామ్, హెక్సాకొనజోల్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుత తేమ వాతావరణ పరిస్థితులకు వరిలో జింక్ లోపం తలెత్తే అవకాశం ఉందని, దీని నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. నేరుగా విత్తిన వరి పంటలో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

నారుమడులు తేరుకుంటున్నాయి

మండలంలో నీటి మునిగిన నారుమడులు కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. నారును కాపాడుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవసరమైన సూచనలిస్తున్నాం. పూర్తిగా నాశనమైన వరి నారు రైతులకు అవసరమైన విత్తనాలు వీలైనంత వేగంగా అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. ఆర్‌జీఎల్ రకం విత్తనాలు 57.6 క్వింటాళ్లు, సాంబమసూరి 11.52 క్వింటాళ్లు అవసరమని ఆ నివేదికలో పేర్కొన్నాం. ఈ వర్షాలు ఆగేంత వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలి.

–పి.రంగాచారి,
మండల వ్యవసాయ అధికారి,
అనకాపల్లి మండలం

అయ్యంకి వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయం



అయ్యంకి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ఏర్పాటుకు ఆద్యుడైన వెంకటరమణయ్య కృషిని, సేవలను వక్తలు ప్రస్తుతించారు. ఆయన జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



ఆటలాడుతున్న చిన్నారులు

మునగపాక : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఈవో–1,2లు వేణుగోపాలరావు,శివనాయుడు కోరారు. శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా బుధవారం క్రీడాదినోత్సవం నిర్వహించారు. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే పలు క్రీడల విశిష్టతను వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లలకు గుర్తు చేశారు.

అందరి కృషితో బాల్య వివాహాల నిర్మూలన

అనకాపల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ నిర్మలకుమారి, 7వ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి ఉమ అన్నారు. ఐసీడీఎస్–సెక్టార్ 3 పరిధి స్థానిక మళ్లవీధిలో బుధవారం మిషన్ శక్తి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జోన్ పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత, బాలికా రక్షణ, భారత న్యాయసంహిత నందు ఆడపిల్లల రక్షణ చట్టాలు, ప్రధానమంత్రి మాతృవందన యోజన తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ర్యాలీలో సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు ముత్తా శ్రీలక్ష్మి, ఎం.సౌజన్య, ఎంపీఎల్ సంతోషి, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.



మిషన్ శక్తి ర్యాలీలో ఐసీడీఎస్ ఉద్యోగులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అరబుపాలెంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక:మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. అరబుపాలెంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా కుట్టు శిక్షణ ద్వారా వచ్చే ఆదాయంతో మెరుగైన జీవితం సాధించాలన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్, శరగడం బిందు, ట్రైనీ టీచర్ మహలక్ష్మమ్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒలింపిక్ క్రీడల్లో భారత్ మెరవాలి



దేశ క్రీడాకారులకు ఆల్ ద బెస్ట్ చెప్తున్న విద్యార్థులతో శిలపరశెట్టి బాబి

అనకాపల్లి: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 11 వరకూ జరగనున్న క్రీడల్లో భారత్ ఆటగాళ్లు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించాలని అనకాపల్లి బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ కార్యదర్శి శిలపరశెట్టి బాబి ఆకాంక్షించారు. 16 అంశాల్లో భారత దేశం నుంచి పోటీపడుతున్న 117 మంది క్రీడాకారులకు స్థానిక వీవీ రమణ రైతుభారతి హాల్లో విద్యార్థులతో కలిసి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోక్యోలో జరిగిన 2019 ఒలింపిక్ క్రీడల్లో మన దేశ క్రీడాకారులు 7 పతకాలు సాధించారని, ఈసారి మరిన్ని పతకాలతో దేశ కీర్తిప్రతిష్ఠలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వెయిట్‌లిఫ్టింగ్ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలరావు, అసోసియేషన్ ప్రతినిధులు అమరపల్లి కృష్ణాజీ, కర్రి అప్పాజీ, దాడి శ్యామ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, కె.నాయుడు, గుండ్రపు నీల, మద్దాల సురేష్, దేముడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వుషు పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

పరవాడ: రాష్ట్ర వుషు సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రిలో నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ వుషు పోటీల్లో ప్రతిభ చూపి పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి వుషు పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. పాఠశాలకు చెందిన రాహుల్ మిస్త్రీ, పి.అభినవ్, క్రిష్ దేవని వుషు అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 31 వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించే 23వ జూనియర్ నేషనల్ వుషు పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ చెప్పారు. ఎంపికైన విద్యార్థులతో పాటు కోచ్ రమ్యను పాఠశాల సీఈవో కె.నిశాంత్, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి అభినందించి జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.



వుషు పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సీఈవో నిశాంత్, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

తైక్వాండో విజేతలకు అభినందన

ఎస్.రాయవరం : తైక్వాండో పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల బుధవారం అభినందించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు సమక్షంలో ఈ విద్యార్థులకు సాధించిన మెడల్స్‌ను అందజేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో 18 కేజీల విభాగంలో కిల్లాడ హమబిందు గోల్డ్ మెడల్, అండర్ 40 కేజీల విభాగంలో కిల్లాడి నాగాంజలి సిల్వమెడల్ సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బాలికలు తైక్వాండో వంటి క్రీడలు వ్యక్తిగత రక్షణతో పాటు, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



తైక్వాండోలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ



నోట్ పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటవురట్ల : శ్రీ సత్యసాయి యూనివర్సల్ వెల్ఫేర్ గ్రూపు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. కొడవటిపూడిలోని ఎంపీయూపీ స్కూల్లో బుధవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ నిర్వహించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి స్థాయికి ఎదగాలని ట్రస్ట్ ప్రతినిధులు కోరారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.కృష్ణప్రసాద్, ఎంపీటీసీ యలమంచి ప్రకాష్, సర్పంచ్ కోసూరు అప్పారావు, ట్రస్ట్ ప్రతినిధి శెట్టి విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌లో గ్రామీణ ఆటల పోటీలు



బాలికల కుర్చీలాట



కాలుగుంటాట ఆడుతున్న బాలికలు

కశింకోట: పూర్వ కాలంలో గ్రామాల్లో ఆడే ఆటలు కనుమరుగవుతున్నాయని, వాటి పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించి, ఆ ఆటల్ని ఆడేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎంపీఆర్ అప్పారావు కోరారు. హైస్కూల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు తమ చిన్నతనంలో ఆడిన ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వీకులు ఆడుకున్న ఆటలకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. విద్యార్థులతో ఈ సందర్భంగా తాడాట, ఏడు పిక్కల ఆట, కబడ్డీ, గుంటాట, మ్యూజికల్ చైర్, కప్ప గెంతులు, బచ్చాట తదితర ఆటలు ఆడించారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా ఈ ఆటలు ఆడారు. కార్యక్రమంలో ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్ పాపారావుకు వినతి అందజేస్తున్న రైతు ప్రతినిధులు

మునగపాక : ఆకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురైన నారుమడులకు సంబంధించి రైతులు 3వేలకు పైగా పెట్టుబడులు చేశారని, కొంతమంది రైతులు ఎద జల్లేందుకు ఎకరాకు రూ.15వేలకు పైగా పెట్టుబడులు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలన్నారు. వినతి అందజేసిన వారిలో సీఐటీయూ నేత ఎస్.బ్రహ్మాజీ, బీటీఆర్ అప్పారావు, మళ్ల జోగారావు, భీశెట్టి రాము తదితరులున్నారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళాల వెల్లువ

మునగపాక : మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి పలువురు దాతలు తమ సహకారాన్ని అందిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన ఆడారి పరశురామ్–పైడితల్లమ్మ దంపతులు రూ.5,116 నగదును బుధవారం విరాళంగా అందజేశారు.అలాగే పాటిపల్లికి చెందిన కొయిలాడ త్రిమూర్తులు–ధనలక్ష్మి దంపతులు రూ.5,116 అలాగే మంగళవరపుపేటకు చెందిన సరిసా శ్రీనివాసరావు–గాయత్రి దంపతులు రూ.5,116 నగదును కమిటీ సభ్యులకు విరాళాలుగా అందజేశారు. సర్పంచ్ గంగప్పలనాయుడు,కమిటీ సభ్యులు కాశీ , నాగేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిత్ర బృందం...ఆపన్న హస్తం

కోటవురట్ల : తమ మిత్రుడు ఆపదలో ఉంటే మిత్ర బృందం వెంటనే స్పందించింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మిత్రుడికి మేమున్నామంటూ ఆపన్న హస్తం అందించింది. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్లో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన సుర్ల నూకరాజు కుమార్తె బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ గత 15 రోజులుగా విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మిత్రుని గురించి పూర్వ విద్యార్థులు తెలుసుకున్నారు. వెంటనే అతని ఇంటికి వెళ్లి రూ.20 వేలు నగదు అందించి భరోసా కల్పించారు. మిత్రుల సహాయానికి నూకరాజు కృతజ్ఞతలు తెలిపారు. మిత్రునికి సాయం అందించిన వారిలో పచ్చార అర్జునరావు, మాకిరెడ్డి నగేష్, కె.జయబాబు, ఎ.శ్రీరామ్మూర్తి, పైల వరలక్ష్మి, రావాడ బాబ్జీ, నరేంద్ర ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

రాంబిల్లి(యలమంచిలి) : ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందుతోందని వెంకటాపురం ఎంపీయూపీ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ధూళి నానాజీ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విద్య పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారిలో విజ్ఞానం, సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసే అవకాశం కలుగుతుందన్నారు. ఎంతో నైపుణ్యం, ప్రతిభ కలిగి ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు ఇపుడు ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆసక్తి చూపుతున్నారని అన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించి డిజిటల్ విద్యను కూడా ప్రవేశపెట్టిందని తెలిపారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం అందించే సదుపాయాలు వినియోగించుకుని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు.



వెంకటాపురం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ నానాజీ

వీధి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

నక్కపల్లి: స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో పలు వీధి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఏఈ నరేంద్ర తెలిపారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దేవదాయ శాఖకు చెందిన స్థలాన్ని కొనుగోలు చేసి నక్కపల్లికి చెందిన సుమారు 300 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ పథకంలో ఇళ్లు కూడా మంజూరు చేశారు. దాదాపు 200 మందికి పైగా ఇక్కడ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ కాలనీలో వీధి రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ బీజేపీకి చెందిన నేతలు కోసూరు శ్రీను తదితరులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఈ నరేంద్ర, వెంకటేష్ బుధవారం కాలనీలో పర్యటించారు. రోడ్లు వేయాల్సిన ప్రాంతాల్లో కొలతలు తీసుకోవడం జరిగిందని, వీటి మంజూరుకు సంబంధించి ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపించడం జరుగుతుందని ఏఈఈ తెలిపారు. స్థానిక నాయకులు కోసూరు శ్రీను, నానిబాబు, సకురు స్వామి, అప్పన్న, కర్రిరవి, నాగు పాల్గొన్నారు.



రోడ్ల నిర్మాణానికి కొలతలు తీస్తున్న ఏఈలు